సాక్షి
జనగామ
సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024



'సాఫ్ట్‌వేర్' వదిలి..సాగు చేపట్టి

మహబూబాబాద్ మండలం సోమ్లతండా గ్రామానికి చెందిన రాజ్‌కుమార్, అశ్విని దంపతులు జిర పంట సాగు చేస్తూ అధిక లాభాలు పొందుతున్నారు. - 8లో



సమాజహిత పరిశోధనలు చేయాలి

సమాజహిత పరిశోధనలు చేయాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
33^{0} /20^{0}

వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో పలుచోట్ల గాలి దుమారం, చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రెసిడెంట్‌గా వీరస్వామి



లింగాలఘణపురం/జనగామ రూరల్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని కుందారం గ్రామానికి చెందిన చిర్ర వీరస్వామి, జిల్లా కార్యదర్శిగా జనగామ మండలం శామీర్‌పేటకు చెందిన గుర్రాల సురేశ్‌లను నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ హక్కులు, రిజర్వేషన్లు, అభివృద్ధి, రాజ్యాధికారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు హరీశ్, నాయకులు శ్రీనివాసు, కుమార్, సుమన్, మైపాల్, ఆనంద్ తదితరులు వీరి నియామకంపై అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని చెన బోయిన పూజశ్రీ జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఆకుల సాయికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థినీ పూజశ్రీ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడా ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 25 నుంచి 29 వరకు హర్యానా రాష్ట్రంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కాగా పూజశ్రీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై నోడల్ ఆఫీసర్ ఎండీ పర్వేజ్, బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి వీరన్న, ఉపాధ్యక్షులు గాదె పాక అయోధ్య, కోశాధికారి కాటం రాజిరెడ్డి అభినందించిన వారిలో ఉన్నారు.

రేపు దర్గా ఉత్సవాలు

జనగామ రూరల్: హైదరాబాద్ రోడ్డు హెచ్‌పీ పెట్రోల్ పంప్ ఎదురుగా ఉన్న హజ్రత్ సయ్యద్ యాకూబ్ షావలి, రహమతుల్లా అలై చిల్ల ముబార్ దర్గాలో ఈ నెల 24న ఉర్సు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ప్రకటించారు. 24న ఉదయం 10 గంటలకు హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి సందల్ ఊరేగింపు ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటలకు దర్గాకు చేరుకుంటుందన్నారు. ఫాతిహా అనంతరం అన్నదానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మండల స్థాయిలోనూ గ్రీవెన్స్

జనగామ రూరల్: జిల్లా కలెక్టరేట్‌తో పాటు 12 మండలాల పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాల్లో నేడు గ్రీవెన్స్ సెల్ నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు కలుగకూడదనే ఉద్దేశ్యంతో ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్‌కు తోడు, మండల స్థాయిలోనూ ఏర్పాటు చేశామని, దీనిని ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



గాలి దుమారం

జనగామ: జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి భారీగా వీచిన గాలి దుమారంతో ఆర్టీసీ బస్టాండ్ ఏరియా శ్రీరాం హోటల్ సమీపంలో విద్యుత్ తీగలు తెగి కిందపడ్డాయి. గాలి దుమారం పెరగడంతో అప్పటికే కరెంట్ సరఫరాను నిలిపేయడంతో ప్రమాదం తప్పింది. ఎన్పీడీసీఎల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పునరుద్ధరణ పనులు చేపట్టారు.

మరుగునపడిన 'మాస్టర్‌ప్లాన్'!



గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏళ్లు గడుస్తున్నా.. కొత్త మాస్టర్‌ప్లాన్ అమల్లోకి రావడం లేదు. జనాభా 10 లక్షలకు మించి ఉన్న నగరంలో మూడేళ్ల క్రితం మరోసారి ప్రయోగం చేశారు. ముసాయిదా ప్రచురించి, కార్పొరేషన్ తీర్మానంతో 'కుడా' మాస్టర్‌ప్లాన్ ఫైల్ ప్రభుత్వానికి పంపగా సీఎం పేషీలోనే ఆగిపోయింది. తాజాగా, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధుల కోరిక మేరకు వరంగల్‌లో మాస్టర్‌ప్లాన్ -2050 అమలుకు ఇటీవల జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇంకా కదలిక లేదు.

అస్తవ్యస్తంగా పట్టణ ప్రణాళికలు

- కాలం చెల్లిన ప్లాన్‌లతోనే పనులు
- 2021లోనూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు.. ఉమ్మడి వరంగల్‌లో అన్నీ పెండింగ్‌లోనే..
- గ్రేటర్ వరంగల్ సహా పలు మున్సిపాలిటీలదీ ఇదే పరిస్థితి..
- 'గ్రేటర్'పై ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ
- 'మాస్టర్‌ప్లాన్'ల ఆమోదంపై మళ్లీ ఆశలు

జనగామ మున్సిపాలిటీ 1953లో ఏర్పడింది. 1987లో దీని పరిధిలో మాస్టర్‌ప్లాన్ అమలు చేసేందుకు అడుగులు పడ్డాయి. 1990లో పాక్షికంగా అమల్లోకి తెచ్చారు. ఆ తర్వాత మూడు దశాబ్దాలు గడిచినా మాస్టర్ ప్లాన్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. డీటీసీపీ ఆదేశాలతో 2015లో కౌన్సిల్ కొత్త మాస్టర్ ప్లాన్ తయారీకి తీర్మానం చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో 2017లో రివైజ్డ్ మాస్టర్ ప్లాన్.. 2021లో పంపిన ప్రతిపాదనలు ఇంకా పరిశీలనలోనే ఉన్నాయి.

సాక్షిప్రతినిధి, వరంగల్ :

.. ఇలా ఉమ్మడి వరంగల్‌లో ప్రణాళికాబద్ధమైన పట్టణాల అభివృద్ధికి వడివడిగా పడాల్సిన అడుగులు ముందుకు సాగడం లేదు. కొత్త మున్సిపాలిటీలను మొదటి నుంచే ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు 2021లో మాస్టర్ ప్లాన్‌పై కసరత్తు చేయాలని ఆదేశాలున్నా ఆచరణలో సాధ్యం కాలేదు. ప్రతీ పట్టణానికి మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని అప్పటి మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేటీఆర్ 2021 డిసెంబర్ 30న అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వరంగల్‌లోని డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగం (డీటీసీపీ) మాస్టర్ ప్లాన్లను రూపొందించాలని మున్సిపాలిటీలను ఆదేశించింది. అయితే, 2022 జూన్ 2.. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి మాస్టర్ ప్లాన్లను సిద్ధం చేయాలన్న లక్ష్యం నెరవేరలేదు.

ఏళ్లుగా పెండింగ్‌లోనే..

మున్సిపాలిటీల్లో టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(డీటీసీపీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్(ఎన్ఐయూఎం), ప్రైవేట్ కన్సల్టెన్సీలు 2021 డిసెంబర్‌లో కొత్తగా బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్)లను సిద్ధం చేయగా అధికారులు ప్రభుత్వానికి పంపించారు. వాటికి ఆమోదం తెలుపకపోగా.. గత పాలకుల వైఖరినే అవలంబించడంతో ఏళ్లుగా ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఇదిలా ఉంటే 10 లక్షలకు మించిన జనాభా ఉన్న వరంగల్‌లో 50 ఏళ్ల నాటి మాస్టర్ ప్లానే ఇప్పటికీ అమలులో ఉంది. నాలుగేళ్ల క్రితం కొత్తగా రూపొందించి మున్సిపల్ ఎన్నికలకు ముందు ముసాయిదా ప్రచురించి కార్పొరేషన్ తీర్మానంతో ప్రభుత్వానికి పంపించారు. దానికీ ప్రభుత్వ ఆమోదం ఇప్పటికీ రాలేదు. జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్ ప్రణాళికలను కూడా 2021 సంవత్సరానికి ముందే ప్రభుత్వానికి నివేదించారు. నర్సంపేట మున్సిపాలిటీ డ్రాఫ్ట్ తయారు చేసి సర్వే వివరాలను సంబంధిత శాఖలకు పంపించారు. తొర్రూరు, డోర్నకల్ మున్సిపాలిటీల్లో ఆర్‌డీఎంఏ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం సర్వేలు నిర్వహించి సమర్పించింది. వర్ధన్నపేట మున్సిపాలిటీలో మాస్టర్ ప్లాన్‌కు అవసరమయ్యే డేటాను సేకరించి కౌన్సిల్‌లో పెట్టి ఆమోదం కోసం పంపించారు. పరకాల పట్టణ మాస్టర్ ప్లాన్ మ్యాప్, హద్దుల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేసి పూర్తిస్థాయిలో ప్రణాళిక సిద్ధం చేసి ప్రతిపాదించారు. మరిపెడకు సంబంధించి ఓ ఏజెన్సీ సర్వే చేపట్టి పూర్తి నివేదికలు సిద్ధం చేసి పంపింది. అయితే ఇప్పటి వరకు కూడా పట్టణాలు, నగరాలకు 'మాస్టర్ ప్లాన్' అమలు కాలేదు.

2020 సంవత్సరం అధికారుల అంచనా ప్రకారం మున్సిపాలిటీల వారీగా వార్డులు, జనాభా వివరాలు

కార్పొరేషన్/ మున్సిపాలిటీలు	వార్డులు	జనాభా
గ్రేటర్ వరంగల్	66	10,01,604
పరకాల	22	25,509
జనగామ	30	53,721
భూపాలపల్లి	30	60,540
డోర్నకల్	15	15,658
మహబూబాబాద్	36	69,895
మరిపెడ	15	18,954
తొర్రూరు	16	20,540
నర్సంపేట	24	37,970
వర్ధన్నపేట	12	15,785


ఘనంగా గణనాథుడి నిమజ్జనం



నిమజ్జనానికి బయలుదేరిన గణేశుడు

జనగామ: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఏరియా అమ్మబావి సైనిక్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆదివారం రాత్రి ప్రత్యేక పూజల అనంతరం నిమజ్జనానికి బయలు దేరారు. నిర్వాహక కమిటీ సభ్యులు సంస్కృతి, సంప్రదాయాలను చాటుతూ భారీ గణేశుడిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. రైల్వేస్టేషన్, గౌట్ స్కూల్, నెహ్రూపార్కు, ఆర్టీసీ చౌరస్తా మీదుగా నెల్లుట్ల చెరువు వద్దకు తీసుకు వెళ్లారు. నిమజ్జన ఊరేగింపును పురస్కరించుకుని ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకున్నారు. చివరి రోజు స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సీఐ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో పర్యవేక్షణ చేశారు.

పిడుగుపాటుకు విగ్రహాలు ధ్వంసం



లింగాలఘణపురం: మండలంలోని నేలపోగులలో శనివారం రాత్రి పిడుగు పడి గోపురంపై ఉన్న విగ్రహాలు ధ్వంసమయ్యాయి. ఈ మేరకు గ్రామస్తులు ఆదివారం ఉదయం ఆలయం వద్దకు వెళ్లి పరిశీలించగా శిఖరంపై ఉన్న విగ్రహాలు పగిలిపోయి దుర్గామాత విగ్రహం రెండు చేతులు విరిగి కింద పడ్డాయని గ్రహించారు. అలాగే ఆలయంపై ఉన్న దేవతామూర్తుల విగ్రహాలు కూడా పగిలిపోయి చెల్లాచెదురుగా పడిపోయాయి. గ్రామంలో ఇళ్లపై పడితే ప్రాణాలు పోయేవని, ఆ దుర్గామాతనే ప్రజలకు నష్టం కలుగకుండా చూసిందని ప్రజలు మొక్కుకున్నారు.

విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేయాలి



సాక్షి ప్రతులతో సీఎంఓకు ఎక్స్‌లో ఫిర్యాదు

జనగామ: జిల్లాలోని నిడిగొండ, కంచనపల్లితో పాటు అక్రమాలు జరిగాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యవసాయ సహకార సొసైటీ (పీఏసీఎస్)ల పరిధిలో విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ అమ్మఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు, సామాజిక సేవకులు వంగ భీమ్‌రాజ్ సాక్షిలో ప్రచురితమైన కథనాలతో సీఎంఓకు ఎక్స్‌లో విన్నపం చేశారు. రఘునాథపల్లి మండలంలోని నిడిగొండ, కంచనపల్లి రెండు పీఏసీఎస్‌ల పరిధిలో ఆధార్ మిస్ మ్యాచింగ్, రుణం తీసుకోకున్నా తీసుకున్నట్లు రికార్డులు చూపించి, ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడినట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపిస్తేనే నిజాలు బయటకు వస్తాయన్నారు. గతంలో ఆరోపణలు ఎదుర్కొన్న బచ్చన్నపేట, లింగాలఘనపురం మండలం కళ్లెం తదితర పీఏసీఎస్‌ల వారీగా గత 10 ఏళ్ల నిర్వాహణకు సంబంధించి ఆడిట్ నిర్వహిస్తే అసలు వాస్తవాలు తెలిసే అవకాశం ఉందని, దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి వెంటనే ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

నల్లబ్యాడ్జీలతో ఆర్యవైశ్యుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆర్యవైశ్యులు

జనగామ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్పు చేస్తూ రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపినందుకు నిరసనగా ఆదివారం జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం ఎదుట ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి గట్టు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు నల్ల బ్యాడ్జీలతో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య మహాసభ తొలి అధ్యక్షుడు మహంకాళి హరిశ్చంద్ర గుప్త ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆయన సేవలు గుర్తించి తెలుగు విశ్వవిద్యాలయానికి అమరజీవి పొట్టి శ్రీరాములు నామకరణ చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం అమరజీవి పేరు మార్చడం సమంజసం కాదన్నారు. సురవరం ప్రతాపరెడ్డి పేరును మరో పథకానికి పెట్టుకోవచ్చని, అంతే గాని ఉన్న పేరు మార్చడం ఆర్యవైశ్యులను అవమానపర్చడమేనన్నారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పోకల లింగయ్య, ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బిజ్జాల నవీన్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి జైన రమేష్, నాయకులు లగిశెట్టి వీరలింగం, గొడిశాల శివరామకృష్ణ, గట్టు శ్రీనివాస్, ఐత శ్రీనివాసులు, గందె వేణు, కందుకూరు శ్రీనివాస్, అల్లాడి మహేశ్వర్, బెల్దె శ్రీధర్, గౌరిశెట్టి బాలలింగం, ఎర్రం ప్రసాద్, కాసం విజయ్ కుమార్, నాళ్ల మధు, కందుకూరి కైలాస్, కొడితాల చంద్రమోహన్, బెలిదె అంజయ్య, లగిశెట్టి కిషోర్ తదిరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ నిలిపేయాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

జనగామ రూరల్: హేతుబద్ధీకరణ రేషనలైజేషన్ జీఓ 25ను సవరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఉమాపతి భవన్‌లో జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలో ప్రతీ తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా పాఠశాలలను అభివృద్ధి పర్చాలన్నారు. కానీ అశాస్త్రీయమైన ఆర్‌సీ 1267 ద్వారా జీఓ 25 అమలు చేయాలని పాఠశాల విద్యాసంచాలకులు కలెక్టర్లను ఆదేశించడాన్ని టీపీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. రాజు, వై.వజ్రయ్య, సత్యనారాయణ, శ్రీహరి, శ్రీరామ్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

పెండింగ్ డీఏ చెల్లించాలి

పాలకుర్తి టౌన్: ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 8నెలలు గడుస్తున్నప్పటికీ పెండింగ్ డీఏల చెల్లింపుపై దృష్టి పెట్టకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి పెండింగ్ డీఏలను చెల్లించాలని కోరారు.

వేతన వెతలు

ఐదు నెలలుగా అందని అతిథి అధ్యాపకుల వేతనాలు

- కొత్త జీఓతో ఉపాధి గండం
- జీఓ సవరించి ఆదుకోవాలని వేడుకోలు
- జిల్లాలో 42 మంది గెస్ట్ అధ్యాపకులు



జిల్లాలో అతిథి అధ్యాపకుల వివరాలు

కళాశాల	అధ్యాపకుల సంఖ్య
జనగామ జూనియర్ కళాశాల	8
జనగామ బాలికల కళాశాల	6
దేవరుప్పల	6
నర్మెట	5
దేవరుప్పల	6
కొడకండ్ల	4
జఫర్‌గఢ్	2
స్టేషన్‌ఘణపురం	5

జనగామ రూరల్: పీజీ, పీహెచ్‌డీ పట్టాలు పొంది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిబంధనల ప్రకారం అతిథి అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త జీఓతో వీరి కుటుంబం రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. పదేళ్ల క్రితం గెస్ట్ ఫ్యాకల్టీగా ప్రభుత్వం నియమించింది. పేరుకు పార్ట్ టైం అయిన ఏనాటికైన వారి ఉద్యోగం క్రమబద్ధీకరణ జరుగుతుందని ఎదురుచూసినా.. వారి ఆశలు అడిఆశలుగానే మరాయి. అటు నెలల తరబడి జీతాలు రాక క్రమబద్ధీకరణ జరగక ఇటు మరోచోట ఉపాధి దొరికే అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని 7 ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో మొత్తం 42 మంది గెస్ట్ లెక్చరర్లుగా పని చేస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో తక్కువ శాతం విద్యార్థులు హాజరు అవుతుండగా గెస్ట్ లెక్చరర్‌లను విధుల్లోకి తీసుకోవద్దని ఉన్నతాధికారులు సంకేతాలు ఇచ్చారు. అయిన ప్రభుత్వం షరతులతో కొత్త జీఓ తీసుకొచ్చి మళ్లీ విధులుల్లోకి తీసుకున్నారు.

ఐదు నెలలుగా అందని వేతనాలు

ప్రస్తుతం ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న అతిథి అధ్యాపకులకు గత సంవత్సరం రెండు నెలలు విధులు నిర్వహించినవి, ప్రస్తుత ఏడాది 3 నెలల వేతనాలు ఇప్పటి వరకు ఇవ్వలేదు. దీంతో ఇళ్ల గడవక అవస్థలు పడుతున్నారు. జిల్లాలో 42 మంది గెస్ట్ లెక్చరర్స్ ఉండగా ఒక్కొక్కరు నెలకు 72 తరగతులు బోధించాల్సి ఉంటుంది. క్లాస్‌కు రూ.300 చొప్పున నెలకు రూ.21,600 వేతనంగా చెల్లిస్తున్నారు. జిల్లాలో 2012 నుంచి అతిథి అధ్యాపకుల వ్యవస్థ కొనసాగుతుంది. గతంలో క్లాసుకు రూ.150 చెల్లించగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక 2017 నుంచి రూ.300 చెల్లిస్తున్నారు.

కొత్త జీఓతో తీవ్ర నష్టం

పదేళ్ల క్రితం ప్రభుత్వం ఆయా కళాశాలల్లో ఖాళీలను బట్టి గెస్ట్ ఫ్యాకల్టీని నియమించారు. కళాశాల అభివృద్ధికి రెగ్యులర్ వారితో సమానంగా పని చేస్తూ విద్యార్థుల ప్రవేశాల్లో ప్రచారం చేస్తూ కీలకంగా పని చేస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం కూడా పాత అధ్యాపకులనే కొనసాగించాలని ప్రభుత్వ ఆదేశాలు రావడంతో మళ్లీ వారినే విధుల్లోకి తీసుకున్నారు. అయితే కొత్త జీఓతో వారి ఉపాధికి భరోసా లేకుండా పోయిందని, రెగ్యులర్ అధ్యాపకులు వచ్చే వరకే విధులు నిర్వహించాలని, ఎప్పుడు ఉద్యోగం మానేయాలన్న అప్పుడు తొలగిపోవాలని పలు షరతులతో విధుల్లోకి తీసుకోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. తమ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని కుటుంబాలు రోడ్డున పడకుండా ఎప్పటి లాగే కొనసాగించాలని అతిథి అధ్యాపకులు కోరుతున్నారు.

నిబంధనల మేరకు పని చేయాలి

అతిథి అధ్యాపకులను విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో మళ్లీ పాత వారినే విధుల్లోకి తీసుకున్నాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని చేయాల్సి ఉంది. జిల్లాలో అధ్యాపకులు 42 మంది విధులు కొనసాగిస్తున్నారు. కానీ 50 మంది అధ్యాపకులు అవసరం ఉందని గతంలోనే ఇంటర్ బోర్డుకు ప్రతిపాదనలు పంపించాం.

- జితేందర్‌రెడ్డి, ఇంటర్ విద్యాధికారి

క్రమబద్ధీకరణ చేసి ఆదుకోవాలి



రాష్ట్ర వ్యాప్తంగా 404 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 1,668 మంది అతిథి అధ్యాపకులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరణ చేసి ఆదుకోవాలి. పదేళ్ల నుంచి గెస్ట్ ఫ్యాకల్టీగా విధులు నిర్వహిస్తున్న వారి ఉపాధి కోల్పోకుండా జీఓను సవరించి కుటుంబాలను ఆదుకోవాలి. పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి. సమస్యల పరిష్కారానికి సహకరించాలి.

- ఎస్.నరేశ్ అతిథి అధ్యాపకుడు జఫర్‌గఢ్

వేతనాలు సకాలంలో అందించాలి



చాలీచాలని వేతనాలతో ఇల్లు గడవక అవస్థలు పడుతున్నాం. కొత్త జీఓతో ఉపాధికి గండం ఏర్పడింది. గత ఏడాది రెండు నెలలు, ప్రస్తుత విద్యాసంవత్సరంలో మూడు నెలల వేతనాలు విడుదల చేయాలి. ప్రభుత్వం రెగ్యూలర్ అధ్యాపకుల మాదిరిగా అతిథి అధ్యాపకులకు రెగ్యూలర్‌గా వేతనాలు అందించి కుటుంబాలను ఆదుకోవాలి.

- డి.మధు, గెస్ట్ ఫ్యాకల్టీ
జనగామ కో ఎడ్యుకేషన్ కళాశాల

పంటలు ఎండుతున్నా.. పట్టించుకోరా?

జనగామ రూరల్: ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు కొట్టేస్తూ ఫీడర్ సమస్యతో ఇబ్బందులు పడుతుంటే విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని, దీంతో పంటలు ఎండుతున్నాయని చీటకోడూర్ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అధిక లోడ్ సమస్య ఎక్కువ కావడంతో ఫీజులు కొట్టేస్తున్నాయని, అధికారులు ఫీడర్ ఏర్పాటు చేయాల్సి ఉండగా పట్టించుకోకపోవడంతో రైతులు సొంత ఖర్చులతో పెట్టించారు. అయితే ఫీడర్ డివైడ్ చేయాల్సిన అధికారులు ఆ పనులు చేయకపోవడంతో 15 రోజుల నుంచి ఫీజులు కొట్టేస్తూ బోర్లు నడవక పంటలు ఎండుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేదంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కనకారెడ్డి, యాదగిరి, మాల్లారెడ్డి, లక్ష్మణ్, కిష్టయ్య, విజయ్, శివశంకర్, అంజయ్య, భాస్కర్, శ్రీనివాస్, సత్యం తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతులు

క్లుప్తంగా

రామప్ప ఉప ఆలయాలకు రక్షణ కరువు

- గొల్లాల గుడిలో గుప్తనిధుల కోసం తవ్వకాలు
- పైకప్పు నుంచి చొరబడి శివలింగాన్ని పెకిలించిన దుండగులు


తవ్వకాల్లో పెకిలించబడిన శివలింగం

వెంకటాపురం(ఎం): యునెస్కో గుర్తింపు పొందినా రామప్ప ప్రాంతానికి, చుట్టూ ఉన్న ఉప ఆలయాలకు రక్షణ కరువైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో నిధులు ఖర్చు చేస్తూ రోజురోజుకూ ఆలయం చుట్టుపక్కల రక్షణ పేరుతో ఆంక్షలు పెంచుతూ వస్తున్నాయి. దీంతో రాత్రి సమయంలో భక్తులు, పర్యాటకుల సంచారం తగ్గుతూ వస్తోంది. ఇదే అదనుగా భావించిన కొంతమంది కన్ను ఉప ఆలయాలపై పడింది. గొల్లాల గుడిలో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఆలయంపై పుకప్పును పగలగొట్టి లోపలికి చొరబడిన దుండగులు శివలింగాన్ని పెకిలించి తవ్వకాలు జరిపిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. పక్కనే ఉన్న శిల్పం పగలగొట్టి పడేసి ఉంది. దీంతో పాటు గొల్లాలగుడి అక్కడక్కడ ధ్వంసమైంది. ఆదివారం మధ్యాహ్నం పురావస్తు శాఖ సిబ్బంది గుడిని శుభ్రం చేయడానికి వెళ్లిన క్రమంలో ఈ దృశ్యాలు కనిపించారు. దీంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించగా ఈ విషయం బయటికి వచ్చింది. ఈ విషయమై ఎస్సై సతీశ్‌ను వివరణ కోరగా పురావస్తుశాఖ అధికారులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నామన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు గుండెనొప్పి..

- బస్సు నిలిపి గార్ల సీహెచ్‌సీలో చికిత్స


చికిత్స పొందుతున్న ఆర్టీసీ డ్రైవర్ వెంకన్న

గార్ల: బస్సు నడుపుతున్న సమయంలో ఓ ఆర్టీసీ డ్రైవర్‌కు గుండెనొప్పి వచ్చింది. దీంతో హుటాహుటిన స్థానిక సీహెచ్‌సీకి తరలించి వైద్యచికిత్స చేయించారు. ఈ ఘటన ఆదివారం గార్లలో జరిగింది. షటిల్ ఆర్టీసీ బస్సు ఇల్లెందు నుంచి వయా గార్ల మీదుగా ఖమ్మం వెళ్తోంది. ఈ క్రమంలో డ్రైవర్ పగిళ్ల వెంకన్న తనకు గుండెనొప్పి ఉందని కండక్టర్ సంధ్యారాణికి చెప్పాడు. దీంతో గార్లలో బస్సు నిలిపి డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. డ్రైవర్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. కాగా, ఆ సమయంలో కృష్ణా ఎక్స్‌ప్రెస్ రావడంతో ప్రయాణికులు రైలు ఎక్కి ఖమ్మం వెళ్లారు.

రెడ్డి చికెన్ సెంటర్
Cell: 9989299661

'సాఫ్ట్‌వేర్' వదిలి.. సాగు చేపట్టి

బీరసాగుతో లాభాలు గడిస్తున్న రైతు

- రోజుకు దాదాపు రూ. 17వేల వరకు ఆదాయం
- మూడేళ్లుగా పంట సాగు
- ఆదర్శంగా నిలుస్తున్న దంపతులు


తోటలో విరగ్గాసిన బీరకాయలు

మహబూబాబాద్ రూరల్ : ఆ దంపతులు.. కుటుంబ పోషణకు సాఫ్ట్ వేర్ ఉద్యోగ వేతనం సరిపోదని నిర్ణయానికి వచ్చారు.. అలాగే, ఒకరి కింద పని చేయడం వల్ల తమకు ఆర్థికాభివృద్ధి జరగదని, తమ కాళ్లపై తాము నిలబడాలని ఆలోచించారు. వెంటనే భర్త ఆ ఉద్యోగానికి రాజీనామా చేశారు. అనంతరం ఏదైనా పంటలు సాగుచేద్దామని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడువుగా బీర సాగు చేపట్టి లాభాలు గడిస్తున్నారు. రోజుకు దాదాపు రూ. 17వేల వరకు సంపాదిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వారే మహబూబాబాద్ మండలం సోమ్లాతండా గ్రామానికి చెందిన బానోత్ రాజ్‌కుమార్, అశ్విని దంపతులు. మూడేళ్లుగా బీర పంట సాగు అధిక లాభాలు పొందుతున్నారు. గ్రామానికి చెందిన బానోత్ సూర్య, కాంచన దంపతుల ఏకైక కుమారుడు రాజ్‌కుమార్ హైదరాబాద్ లోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 2019లో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. అనంతరం ఫైనాన్షియల్ జిల్లాలో నెలకు రూ.30 వేల చొప్పున వేతనంతో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేశాడు. రెండు ఏళ్లపాటు ఉద్యోగం చేశాక కరోనా సమయంలో తమ స్వగ్రామానికి చేరుకున్నాడు. అనంతరం 2022లో అశ్వినితో వివాహం జరిగింది. ఈ క్రమంలో కుటుంబ పోషణకు సాఫ్ట్ వేర్ ఉద్యోగ వేతనం సరిపోదని భావించారు. ఏదైనా పంటలు సాగుచేద్దామని నిర్ణయించుకున్నారు. విద్యావంతురాలైన భార్య అశ్విని సహకారంతో కూరగాయల సాగు చేపట్టాలనుకున్నారు. అనుకున్నదే తడువుగా మూడు ఎకరాల్లో బీరసాగు ప్రారంభించారు. కొంతమేరకు దిగుబడి పెరిగి ఆశించిన మేరకు ఆదాయం వచ్చింది. దీంతో దానికి అదనంగా మరో మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని మొత్తం ఆరు ఎకరాల్లో భూమిలో బీరసాగు చేస్తున్నారు. ఆ దంపతులకు మిత్రుడు ఇస్లావత్ శివాజీ సహకారం అందిస్తున్నాడు. ఇటీవల వర్షాలు అధికంగా కురిసి రాష్ట్రంతో పాటు పక్క రాష్ట్రాల్లో కూడా కూరగాయల దిగుబడి తగ్గిపోవడంతో స్థానికంగా సాగు చేస్తున్న బీరకు అధిక డిమాండ్ పెరిగింది. బీర సాగు చేస్తున్న ప్రాంతంలో కిలో రూ.70 చొప్పున రోజుకు 30 కిలోల వరకు విక్రయిస్తున్నారు. రోజుకు రెండున్నర నుంచి మూడు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుండగా మహబూబాబాద్ కూరగాయల మార్కెట్‌కు తీసుకెళ్లి కిలో రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ విధంగా రాజ్‌కుమార్ అశ్విని దంపతులు రోజుకు రూ.15 వేల చొప్పున లాభం గడిస్తున్నారు. బీర తోట వద్ద కిలో రూ.70 చొప్పున విక్రయించడం వల్ల రోజూ 30 కిలోల వరకు అమ్ముడుపోయి ఆ విధంగా కూడా రోజుకు రూ.2,100 చొప్పున సంపాదిస్తున్నారు.


బీరకాయలు కోస్తున్న బానోత్ రాజ్ కుమార్, అశ్విని దంపతులు

మోతాదు మించితే నష్టమే..

- వరిలో కలుపు మందులతో జాగ్రత్త
- అవగాహన లేకుంటే పంటలకు నష్టం
- కేవీకే కోఆర్డినేటర్ రాజన్న


వరి పంటలో కలుపు తీస్తున్న కూలీలు

మామునూరు : వరి సాగు ఏ పద్ధతిలో చేస్తున్న అధిక దిగుబడి కోసం రైతులు కచ్చితంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వరిలో కలుపు సమస్య అధికంగా ఉండడంతో దాని నివారణకు సరైన సమయంలో చర్యలు చేపట్టకపోతే అధిక దిగుబడులు సాధించలేం. పంటలో కలుపుతీతకు కూలీల కొరత ఏర్పడడంతో పాటు కూలి సైతం విపరీతంగా పెరిగింది. దీంతో రైతులు ఇతర పద్ధతులపై ఆధారపడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల కలుపు మందులు ఉన్నాయి. వాటిని ఎలా వినియోగించాలో పూర్తిగా తెలుసుకున్న తర్వాతే చల్లుకోవాలి. మందులు కొనుగోలు చేసేటప్పుడు రైతులు జాగ్రత్తలు పాటించాలని మామునూరు కేవీకే శాస్త్రవేత్త కోఆర్డినేటర్ రాజన్న సూచిస్తున్నారు. కలుపు నిర్మూలనకు రైతులు పరిమితంగా రసాయనాలు వాడుతూ అంతర కృషి చేయడం వంటి సేద్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది.



- వరి పంట 35–45 రోజుల దశలో ఉంది. చాలా గ్రామాల్లో వివిధ పంటలు కలుపు దశకు చేరుకున్నాయి. కొన్ని రకాల కలుపు మందులను విత్తనం విత్తిన వెంటనే చల్లుకుంటే ఉపయోగం ఉండదు. 15–20 రోజుల తర్వాత లేదా కలుపు 3–4 ఆకుల దశకు చేరిన తర్వాత పంట, కలుపుపై పిచికారీ చేయాలి.
- సోయా, కంది, వేరుశనగ, మినుము, పెసర, ఇమజథా ఫైర్–300 మిల్లీ లీటర్లు.. ఎకరానికి పిచికారీ చేయాలి.
- వరి: పెనాక్సులమ్, సైహ లోపాస్ బ్యూటెల్ –800 మి.లీలు లేదా ట్రయాఫమోన్, ఇథాక్సీస ల్ఫ్యూర్యాన్ 90 గ్రా ఎకరానికి వాగాలి.
- సోయా: డైక్లోసులమ్ 12గ్రా లేదా ఫ్లూమి ఆక్సాజిన్–100 మిల్లీలు ఎకరానికి సరిపోతుంది.
- వరిలో గడ్డి జాతి కలుపు నివారణకు 15–20 రోజు లప్పుడు ఫినాక్స్‌ప్రోప్ పి ఈథైల్–200 మి.లీలు ఎకరాని వాడాలి.
- వరిలో వెడల్పాకు కలుపు నివారణకు 25–30 రోజుల దశలో 2–4డి సోడియం సాల్ట్ 500గ్రా ఎకరానికి చల్లుకోవడం ఉత్తమం.

సమాజ హిత పరిశోధనలు చేయాలి

- కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి


మాట్లాడుతున్న కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: సమాజ హిత పరిశోధనలు చేయాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డిఅన్నారు. ఆదివారం కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగం పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా ఓటర్ పల్స్, పీపుల్‌పల్స్ , పీపుల్ బిహేవియర్, ఎప్లాయిబులిటీ పెంచేలా పరిశోధనలు చేయాలని, సిలబస్‌లో నూతన అంశాలను జోడించాలని పొలిటికల్ సైన్స్ పరిశోధకులకు సూచించారు. తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్, పొలిటికల్ సైన్స్ విభాగం పూర్వవిద్యార్థి ఎండీ రియాజ్ మాట్లాడుతూ యూనివర్సిటీకి రుణపడి ఉంటామని, పొలిటికల్ సైన్స్ విభాగం గ్రంథాలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానన్నారు. కేయూఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ వి. రాంచంద్రం మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు పెరగాలన్నారు.ఈ పొలిటికల్ సైన్స్ విభాగం ఎంతోమందికి మార్గదర్శకం వహించిందన్నారు. పొలిటికల్‌సైన్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యుడు సీహెచ్. దినేశ్‌కుమార్ మాట్లాడుతూ పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు.రిటైర్డ్ ఆచార్యులు హరిప్రసాద్, జి వీరన్న, ఏసీపీ పూర్వవిద్యార్థి జితేందర్‌రెడ్డి మాట్లాడారు. ఆ విభాగం సీనియర్ ఆచార్యుడు రఘురాంరెడ్డిని సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ సభకు పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి సంకినేని వెంకట్ అధ్యక్షత వహించారు. బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్ డాక్టర్ కృష్ణయ్య, ఈ విభాగం పూర్వ విద్యార్థులు, రాజకీయ ప్రముఖులు ఇండ్లనాగేశ్వర్‌రావు, శ్రీరామ్‌శ్యామ్, సారంగపాణి, 1986 నుంచి 2024వరకు ఆ విభాగం విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి

బచ్చన్నపేట : మండలంలోని ఓ గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న ఓ బాలికపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడినట్లు బాలిక కుటుంబీకులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు బాధిత బాలికను సఖి సెంటర్‌కు పంపించారు. అనంతరం లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి తమ అదుపులో ఉంచుకున్నారు. కాగా, సదరు వ్యక్తిని కఠినంగా శిక్షించాలని పలువురు మహిళా సంఘాల నాయకులు కోరారు.

బీరు బాటిల్‌లో ఫంగస్

- కాళేశ్వరంలో నాణ్యతలేని బీర్ల అమ్మకాలు
- మద్యంప్రియుల ఆందోళన


బీరు బాటిల్‌లో ఏర్పడిన ఫంగస్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని తెలంగాణ మద్యం దుకాణంలో కొనుగోలు చేసిన బీరు బాటిల్‌లో ఫంగస్ కనిపించింది. దీంతో నాణ్యతలేని బీర్ల అమ్మకాలు చేస్తున్నారని ఆరోపిస్తూ మద్యం ప్రియులు ఆందోళనకు దిగారు. ఆదివారం జిల్లాలోని చిట్యాల మండలానికి చెందిన కొంత మంది వ్యక్తులు తమ బంధువు మృతి చెందగా కాళేశ్వరంలో గోదావరి వద్ద పిండప్రదాన పూజలు చేశారు. అనంతరం తెలంగాణ మద్యం దుకాణంలో మద్యం తీసుకున్నారు. ఇందులో రెండు బీర్లలో అడుగు భాగంలో ఫంగస్ ఏర్పడింది. తాగిన ఒకరిద్దరు వాంతులు చేసుకున్నారు. దీంతో మద్యం దుకాణం వద్దకు వచ్చి ప్రశ్నించగా నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. కాటారం సబ్‌డివిజన్ అంతా మా చేతుల్లో ఉంది. పోలీసులు, విలేకరులకు చెప్పినా ఎవరూ ఏమి చేయరని దురుసుగా ప్రవర్తించారని మద్యం ప్రియులు పేర్కొన్నారు. ఈ ఘటనపై అధికారులు స్పందించి సదరు మద్యం దుకాణంపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణకు షెడ్యూల్ ప్రకటించాలి

- కేయూ రౌండ్‌టేబుల్ సమావేశంలో మానవహక్కుల వేదిక డిమాండ్


రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న మానవ హక్కుల వేదిక నాయకులు, వివిధ సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: కాలపరిమితితో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టేందుకు షెడ్యూల్ ప్రకటించాలని మానవహక్కుల వేదిక డిమాండ్ చేసింది. ఆదివారం కేయూలోని ఎస్‌డీఎల్‌సీఈ సెమినార్‌హాల్‌లో మానవహక్కుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. తిరుపతయ్య, ఇతర బాధ్యులు పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. 30 ఏళ్ల పోరాటం తరువాత ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ అమలు బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలపై పెట్టిందన్నారు. అయితే ఈ సమస్య కొంతకాలం జాప్యం జరిగే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడ్డారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. కులగణ వెంటనే చేపట్టాలని, ఇప్పటివరకు అమలవుతున్న 50శాతం రిజర్వేషన్ల పరిమితిని వెంటనే ఎత్తివేసి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు అమలు పర్చాలని, పదోన్నతులలో బీసీలకు సైతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు అమలుచేయాలని తీర్మానించింది. కార్యక్రమంలో మానవహక్కులవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదావత్ రాజు, రాష్ట్ర కార్యదర్శి టి. హరికృష్ణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అద్దునూరి యాదగిరి, వి. దిలీప్, కేయూ రిటైర్డ్ ఆచార్యుడు ఎం. ఎర్రగట్టు స్వామి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మందకుమార్ మాదిగ, వివిధ సంఘాల బాధ్యులు తిరునహరిశేషు, జిలకర శ్రీనివాస్, సురేశ్, వెంకటనారాయణ, జి. పద్మజ, నన్నెబోయిన తిరుపతి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- వరిపంటకు మందు పిచికారీ చేస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో ఘటన..


నితిన్ (ఫైల్)

గార్ల: వరి పంటకు పురుగుల మందు పిచికారీ చేసేందుకు కూలీకి వెళ్లిన ఓ యువకుడు పొలంలో తెగిపడిన విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం గార్ల సమీపంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గార్ల మండలం పూమ్యాతండాకు చెందిన గూగులోత్ నితిన్ (19) గార్లలో ఓ రైతు వరి పంటకు పిచికారీ చేస్తున్నాడు. గత రాత్రి వీచిన ఈదురు గాలులకు త్రీఫేజ్ విద్యుత్ లైన్ తీగ పొలంలో తెగిపడింది. ఈ తీగ నితిన్ కాళ్లకు తాకడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా విద్యుత్ స్తంభాల మధ్య దూరం ఎక్కువ ఉండడంతో ఈదురు గాలులకు విద్యుత్ తీగలు రాసుకుని ఓ తీగ పొలంలో తెగిపడిందని రైతు ఆరోపించారు. గత వేసవిలో సైతం ఇదే ప్రాంతంలో విద్యుత్ తీగ తెగిపడడంతో రూ. లక్ష విలువైన పాడిగేదె కూడా మృత్యువాత పడిందన్నారు. ఈ దూరంలో మరో విద్యుత్‌స్తంభం వేస్తే నితిన్ మృతి చెందేవాడు కాదని రైతు పేర్కొన్నారు.

పరిహారం చెల్లించాలని గ్రామస్తుల ఆందోళన

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తన కుమారుడు నితిన్ విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడంటూ మృతుడి కుటుంబీకులు, బంధువులు రోడ్డుపై బైఠాయించి 2 గంటల పాటు ఆందోళన చేపట్టారు. గార్ల బయ్యారం సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు రంగప్రవేశం చేసి విద్యుత్ అధికారులతో మాట్లాడి నితిన్ కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.ఈ ఘటనపై మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్. జీనత్‌కుమార్ వెల్లడించారు.


ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులతో చర్చలు జరుపుతున్న పోలీసులు

గ్రానైట్ క్వారీలో కార్మికుడు..

నెల్లికుదురు : విద్యుత్ షాక్‌తో ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చిన్ననాగారం మీత్యాతండా శివారులో నిర్వహిస్తున్న రత్నశిలా గ్రానైట్ క్వారీలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. క్వారీలో ఒడిశాకు చెందిన మోహిత్ రంజన్ దుర్గా (19) వాటర్ పంపింగ్ చేసే విద్యుత్ మోటార్ల వద్ద నైట్ డ్యూటీ చేస్తున్నాడు. ఈ క్రమంలో మోటార్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌గురై నీటిలో పడి మృతి చెందాడు.

గోడకూలి వృద్ధురాలు..

పెద్దవంగర: గోడకూలి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం మండలంలోని గంట్లకుంటలో జరిగింది. ఎస్సై క్రాంతి కిరణ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బెల్లంకొండ భద్రమ్మ (55) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఉదయం ఇంటి ఎదుట కల్లాపి చల్లి ముగ్గు వేస్తోంది. ఈ క్రమంలో మట్టిగోడ కూలి మీద పడడంతో మృతి చెందింది. మృతురాలికి కుమారుడు సురేశ్, కూతురు స్వప్న ఉన్నారు. సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి బాధిత కుటుంబీకులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఉప్పరగూడెంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీరాం వెంకన్న కుటుంబీకులనూ పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, ముద్దసాని సురేశ్, మురళి, సీతారాం నాయక్, శ్రీనివాస్, హరికృష్ణ, మహేశ్ పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్ దుర్మరణం

- క్లీనర్‌కు స్టీరింగ్ ఇవ్వగా ప్రమాదం..!


లారీ డ్రైవర్ రాంబాబు మృతదేహం

మరిపెడ రూరల్: ఆగిఉన్న ఓ లారీని మరో లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజీ సమీపంలోని ఖమ్మం–వరంగల్ 563 జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ నుంచి ఓ లారీ లోడ్‌తో ఖమ్మం వైపునకు వెళ్తోంది. ఈ క్రమంలో లారీ డ్రైవర్ యడవెల్లి రాంబాబు (37) క్లీనర్‌కు డ్రైవింగ్ చేయమని స్టీరింగ్ ఇచ్చి సేదదీరుతున్నాడు. ఈ క్రమంలో గుజరాత్‌కు చెందిన మరో లారీని డ్రైవర్.. ఎల్లంపేట స్టేజీ సమీపంలో హైవే పక్కన ఆపి నిద్రకు ఉపక్రమించారు. ఈ నేపథ్యంలో క్లీనర్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు పక్క ఆగి ఉన్న గుజరాత్‌కు చెందిన లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో క్లీనర్ సీట్లో కూర్చొని సేదదీరుతున్న డ్రైవర్ రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. రాంబాబుది ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా కంచికాచర్ల మండల కేంద్రం. కాగా, ఘటనా స్థలిని మరిపెడ పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


ఆగి ఉన్న లారీని వెనుక భాగంలో ఢీకొన్న మరో లారీ

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FARM LAND FOR SALE

Farm Land for Marketing @ JP, Dargah. Total 6 Acre. Per Sq.Yd 6,500/-. Interested Companies Please Cont: +91 9646809999. [WA-7541]

PLOT FOR SALE

ఓగ్లాపూర్ పవర్‌గ్రిడ్‌కు ఎదురుగా 200 ఫీట్ రోడ్డుకి ఆనుకొని కాంపౌండ్ కట్టి ఉన్న ప్లాటు (వెడల్పు 30 పొడవు 120) 400 చ॥గ॥ ప్లాటు అమ్మబడును. సంప్ర॥ 9701218888. [W-1237301]

SERVICES

TRAINING & JOBS

శిక్షణ తీసుకుని స్కిల్స్ డెవలప్ చేసుకునే ఆసక్తి కలవారు ఇష్టముతో పని చేయగలవారు కావలెను. మీ బయోడేటా brg.hrteam@gmail.comకు మెయిల్ & 9393113929, 7780473930 కు వాట్సాప్ చేయగలరు. జీ: 10-25K. మ॥ లంచ్. పార్ట్/ఫుల్ టైం జాబ్స్. HNK, WGL, HYD. [WA-7540]

FINANCE

హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్ WGL. 9618767116. [W-1239971]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

మీయొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు. సెల్: 9849145043 [W-1239959]

WANTED

RK Real Estate: హన్మకొండ ఆఫీస్ యందు పని చేయుటకు అనుభవం గల లేడి టెలికాలర్స్ కావలెను. సంప్ర॥ సెల్: 8977429273. [W-1239997]

వరంగల్‌లో ఇంట్లో ఉండి పని చేయుటకు భార్యభర్తలు కావలెను. జీతం ఇద్దరికి కలిపి 18,000/- + ఉచిత వసతి, ఉచిత కరెంట్. ఉదయం 10గం॥ తర్వాత సంప్ర: +91 98499 10111. [WA-17252]

అపార్ట్‌మెంట్స్, షాపింగ్‌మాల్స్, ఆఫీస్‌లలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్, వాచ్‌మెన్స్, ఆయాలు, స్త్రీలు/పురుషులు & ఫ్యామిలీ అర్జెంట్‌గా కావలెను. సంప్ర: 9491710857. [W-1239996]

మీ ఇంటివద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డ్స్ రాయటం స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం 12,000/-. ఫోన్ : 70756 56208 [V-6560]

సెక్యూరిటీ గార్డ్స్ జీతం 15,000/- కోదాడ దగ్గర మేళ్ళచెరువులో కావలెను. 8 గం॥ డ్యూటీ, మంచి జీతం, తక్కువ రేటుకే భోజనం. ✆ 86884 17132, 63008 79854. [B-247]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

'మా భూమి ఇప్పించాలి'

- బాధిత కుటుంబం వేడుకోలు
- పోలీసులకు ఫిర్యాదు
- అక్కను మోసం చేసిన తమ్ముడు..


వివరాలు వెల్లడిస్తున్న బాధితులు

కురవి : పింఛన్ ఇప్పిస్తా.. రైతు బీమా ఇప్పిస్తానని అక్కకు మాయ మాటలు చెప్పిన ఆమె సొంత తమ్ముడు.. అక్క భూమిని తన భార్య పేరుపై పట్టా చేయించుకున్నాడు. ఈ ఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగు చూసింది. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని నేరడ శివారు కాకులబోడు తండాకు చెందిన బానోత్ మల్సూర్ అనే వ్యక్తి కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. తండాలో సర్వేనంబర్ 536/1లో రెండు ఎకరాల భూమి ఉంది. మృతుడి భార్య భద్రమ్మ పేరు మీద రెండేళ్ల క్రితం రిజిస్ట్రేషన్ అయ్యింది. ఈ క్రమంలో తండాకు చెందిన బాధితురాలి సొంత తమ్ముడు గుగులోత్ వీరన్న అనే వ్యక్తి జోక్యం చేసుకుని 'నీకు పింఛన్ వస్తుంది.. రైతుబీమా' వస్తుందంటూ మాయమాటలు చెప్పి తన అక్కను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లాడు. అక్కడ తన భార్య భద్రమ్మ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ విషయం బాధితురాలు భద్రమ్మకు ఇటీవల తెలిసింది. తన మరిది సురేశ్ కుమారుడు అరవింద్‌కు కొంత భూమిని రిజిస్ట్రేషన్ చేయించాలని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే ఆ భూమి తన పేరుపై లేదని విషయం తెలిసిందని భద్రమ్మ పేర్కొంది. తనకు మాయమాటలు చెప్పి తన భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న తన సొంత తమ్ముడు వీరన్నపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు భద్రమ్మ, బంధువులు తెలిపారు.

పది నిమిషాల్లో ఇంటికి చేరేవాడు..

- అంతలోనే అనంతలోకాలకు..
- బైక్‌లు ఎదురెదురుగా ఢీ.. ఆర్టీసీ డ్రైవర్ మృతి
- మామునూరులో ఘటన


రవీందర్ (ఫైల్)

మామునూరు: పది నిమిషాల్లో ఇంటికి చేరుకునేవాడు.. అంతలోనే అనంతలోకాలకు చేరాడు. మృత్యువు మాటు వేసి కాటువేసింది. రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ ఎగిరి రోడ్డుపై పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన 108లో ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై మామునూరు శివారు ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వర్ధన్నపేట మండలం చెన్నారం గ్రామానికి చెందిన ఇలాసాగరం రవీందర్(47) వరంగల్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజు వారీగానే శనివారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై ఖమ్మం రోడ్డ మీదుగా ఇంటికి బయలుదేరాడు. ఈక్రమంలో మామునూరు శివారు ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద ఎదురెదురు రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో రవీందర్ రోడ్డుపై ఎగిరిపడగా తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108లో ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతి చెందాడు.. మరో పదినిమిషాల్లో విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తానని భార్య, సహచరులకు చెప్పిన రవీందర్.. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడని తెలియడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. దీంతో చెన్నారంలో విషాదం నెలకొంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈవిషయం తెలిసిన వెంటనే మామునూరు ఎస్సై కృష్ణవేణి ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదాలకు గల కారణాలను తెలుసుకున్నారు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడి


టాస్క్‌ఫోర్స్ దాడుల్లో పాల్గొన్న సిబ్బంది

వరంగల్ క్రైం : హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని అలంకార్ జంక్షన్ సమీపంలో ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఆదివారం అలంకార్ జంక్షన్‌లో సురేశ్ ఇంట్లో పేకాట ఆడుతుండగా ఆరుగురిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని వారి వద్ద నుంచి ఆరు సెల్‌ఫోన్లు, రూ.40,170 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు వరంగల్ లక్ష్మీ టాకీస్ ప్రాంతానికి చెందిన కందాల శివకుమార్, వికాస్‌నగర్‌కు చెందిన పింగిళి రాజిరెడ్డి, గోపాల్‌పూర్‌కు చెందిన కాలువ విజేందర్, బాలసముద్రానికి చెందిన కొండ్రు కృష్ణ, నయీం నగర్‌కు చెందిన మారినేని మనోహర్, గోపాల్‌పూర్‌కు చెందిన సూరం రాజును అదుపులోకి తీసుకుని హనుమకొండ పోలీసులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు, ఆర్ఎస్సై ఓరుగంటి భాను ప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.